## క్లుప్తంగా

### అసిస్టెంట్ లేబర్ అధికారిపై ఫిర్యాదు

**బెల్లంపల్లి:** సమాచార హక్కు చట్టం ప్రకారం పలుమార్లు దరఖాస్తు చేసి సమాచారం అడిగినా, నిర్లక్ష్యం చేస్తున్న బెల్లంపల్లి అసిస్టెంట్ లేబర్ అధికారి సుకన్యపై ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ ఫిర్యాదు చేశాడు. హైదరాబాద్‌కు వెళ్లి సమాచార హక్కు చట్టం రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో గురువారం ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. బెల్లంపల్లి అసిస్టెంట్ లేబర్ కార్యాలయం నుంచి డెత్, మ్యారేజ్, డెలివరీ స్కీమ్స్ ఇతర అంశాలకు సంబంధించిన వివరాలు అందజేయాలని గడిచిన మూడు నెలల నుంచి సమాచార హక్కు చట్టం ప్రకారం పలుమార్లు దరఖాస్తు చేసినా అసిస్టెంట్ లేబర్ అధికారి అందజేయడం లేదని, తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంతో రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు వెంకటేష్ తెలిపారు. తాను కోరిన వివరాలు అందించాలని ఆయన కోరారు.

### ఆదుకోవాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న కూలీలు

**దండేపల్లి:** మండల కేంద్రం సమీపంలో ఇటీవల ట్రాలీ బోల్తాపడిన ఘటలో గాయపడ్డ ఉపాధి హామీ కూలీలు తమను ఆదుకోవాలని కోరుతూ ఎంపీడీవో ప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ.. ఉపాధి పనిముగించుకుని ఇంటికి వస్తుండగా ట్రాలీ బోల్తాపడటంతో 18మంది కూలీలకు తీవ్రంగా దెబ్బలు తాకాయని, దీంతో తాము పనికి వెళ్లలేని పరిస్థితి ఉందని, తాము పూర్తిగా కోలుకునే వరకు సగం కూలీ ఇప్పించడంతో పాటు, ప్రభుత్వ పరంగా వచ్చే బెనిఫిట్‌ను అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

### గాలివానకు విరిగిపడిన చెట్లు



కాసిపేటలో రోడ్డుపై పడిన చెట్లు

**కాసిపేట:** మండల కేంద్రంలో గురువారం గాలివానకు వృక్షాలు రోడ్డుపై విరిగిపడ్డాయి. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా గాలివాన బీభత్సం సృష్టించింది. రోడ్డుపై పడిన చెట్లను ఎంపీవో నాగరాజు ఆధ్వర్యంలో జేసీబీతో తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. తేలికపాటి వర్షం మాత్రమే పడగా గాలి బీభత్సంతో ఇబ్బందులకు గురయ్యారు.

### పుస్తకాలు పంపిణీ



పంపిణీ చేస్తున్న ఎంఈవో పోచయ్య

**మంచిర్యాలఅర్బన్:** స్థానిక ఎంఈవో కార్యాలయంలో మంచిర్యాల, హాజీపూర్ మండలాలకు చెందిన ప్రభుత్వ, లోకల్‌బాడీ, మోడల్‌స్కూల్, కేజీబీవీలకు సంబంధించిన ఉచిత పుస్తకాలను గురువారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో పోచయ్య పంపిణీ చేశారు. పాఠశాల ప్రారంభమయ్యే రోజు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు పుస్తకాలు అందిచాలని సూచించారు.

### ఆర్థిక సాయం

**జన్నారం:** మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన రాజన్న, శ్యామల ఇళ్ల రేకులు ధ్వంసమై నిరాశ్రయులుగా మారిన విషయం తెలుసుకున్న తెలంగాణ నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ నేత గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. బియ్యం సరుకులతో పాటుగా కొంత నగదును వారికి అందజేశారు. రాజన్న కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని, డబుల్ బెడ్ రూం ఇంటిని నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌కుమార్, నర్సగౌడ్, నాయకులు వెంకటేశ్, రుబెన్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### మజ్జిగ పంపిణీ

**మంచిర్యాలటౌన్:** పట్టణంలోని కాలేజీ రోడ్డులో గల మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని గర్భిణులు, బాలింతలకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. మంచిర్యాలకు చెందిన ఏకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఫౌండర్ లత జెట్టి వేసవి సందర్భంగా పలు ప్రాంతాల్లోని ప్రజలకు ఉచితంగా మజ్జిగను పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

# బడిబాట షురూ..!



రామకృష్ణాపూర్: బడిబాటలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు



జాఫర్‌నగర్‌లో పిల్లలు, వారి తల్లిదండ్రులతో చర్చిస్తున్న ఉపాధ్యాయులు



వేమనపల్లి: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



తాండూర్: ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు



జిల్లా కేంద్రంలోని ఏసీసీలో బడిబాట



భీమారం: బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

- బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఊరూరా చైతన్య ర్యాలీలు
- విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించిన ఉపాధ్యాయులు

**దండేపల్లి/మంచిర్యాలటౌన్/మంచిర్యాలఅర్బన్/భీమారం/భీమిని/రామకృష్ణాపూర్/తాండూర్/మందమర్రిరూరల్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/లక్సెట్టిపేట/వేమనపల్లి:** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. విద్యాసంస్థలు ప్రారంభమయ్యే నాటికి బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ఈ నెల 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగనుంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పూర్తి స్థాయి సౌకర్యాలతో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి వారి భవితకు పునాది వేయాలని ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, మెప్మా సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. బడి ఈడు పిల్లలను పాఠశాలలో ఉండేలా చేయటం, సర్కారు పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను మొదటి రోజు బడిబాటలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, భీమారంలో ఎంఈవో రాధాకృష్ణమూర్తి, మందమర్రిలో ఎంపీడీవో రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తాండూర్‌లో ఎంఈవో వాసాల ప్రభాకర్, మండల నోడల్ అధికారి ఎస్.మల్లేశం, వేమనపల్లిలో ఎంపీడీవో దేవేందర్ రెడ్డి,అధికారులు, ప్రధానోపాధాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాల టౌన్: ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్



దండేపల్లిలో బడిబాట ర్యాలీ



కన్నెపల్లిలో బడిబాట



జిల్లా కేంద్రం గాంధీనగర్‌లో అవగాహన ర్యాలీ



లక్సెట్టిపేట: ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు



ముల్కల్ల వీధుల్లో చైతన్య ర్యాలీ

## ఎరువులేవి సారూ..?

**వేమనపల్లి:** ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుండగా మండలంలోని రైతాంగానికి అవసరమైన ఎరువులు నిల్వ లేదు. ముఖ్యంగా మండల కేంద్రంతో పాటు గొర్లపల్లి, కల్మలపేట, కేతన్‌పల్లి శివారులో అత్యధికంగా పత్తి, మిర్చీ పంటలు సాగు చేస్తారు. ఈ శివారుల్లో పత్తి చేళ్ల వైపు రోడ్ల సౌకర్యంతో పాటు పత్తి చేళ్లలోకి వెళ్లేందుకు ఎడ్లబండ్ల దారులు లేవు. వర్షం పడితే రోడ్డు బురదమయంగా మారే పరిస్థితి ఉంది. పత్తి, మిర్చీ పంట సాగుకు అవసరమయ్యే యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను రైతులు ముందస్తుగా చేళ్లలోకి తరలిస్తారు. చేళ్ల గట్లపై కుప్పలుగా పెట్టుకొని వర్షాలకు తడవకుండా ప్లాస్టిక్ కవర్లతో కట్టు కట్టి నిల్వ ఉంచుకుంటారు. ఒక వైపు రాష్ట్రంలోకి రుతుపవనాలు వచ్చేసి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండగా, అధికారుల్లో ఆందోళన మొదలైంది. వ్యవసాయాధికారులు ఎరువుల బస్తాలు రైతులకు సరిపడా దుకాణాలలో నిల్వ ఉంచలేదు. మండలంలోని ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాలు మూడు ఖాతా సెంటర్లు ఉన్నాయి. ప్రైవేట్ దుకాణాలతో పోల్చుకుంటే ఈ దుకాణాల్లో సబ్సిడీ ధరలకు ఎరువులు లభ్యమవుతాయి. రైతులకు అవసరమైన సమయంలో ఎరువులను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయాధికారులు స్పందించి మండలంలోని అన్ని సబ్సిడీ దుకాణాలకు ఎరువులు అందుబాటులో ఉంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఏవో వీరన్నను వివరణ కోరగా త్వరలోనే మండలంలో అన్ని సెంటర్లలో ఎరువులను అందుబాటులో ఉంచుతామన్నారు. రైతు సేవా కేంద్రానికి 20 మెట్రిక్ టన్నుల ఎరువులు ఇండెంట్ పెట్టామని తెలిపారు.

## ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి



భీమిని: రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో

- జెడ్పీ సీఈవో గణపతి

**భీమిని:** ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించాలని జెడ్పీ సీఈవో గణపతి సూచించారు. మండల కేంద్రంలో గురువారం అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి వ్యక్తికి కూలీ పనులు కల్పించాలన్నారు. ప్రతి కూలీకి రూ.300 వేతనం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సబ్దర్‌ఆలీ, ఏపీవో భాస్కర్, ఈసీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎంపీడీవో కార్యాలయం తనిఖీ**

**నెన్నెల:** స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని గురువారం మంచిర్యాల జెడ్పీ సీఈవో గణపతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. మండలంలో మొత్తం ఎన్ని గ్రామాలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ పథకంలో ఒక్కో గ్రామ పంచాయతీలో సగటున రోజుకు ఎంతమంది కూలీలు హాజరవుతున్నారో కనుక్కున్నారు. ఒక్కో ఉపాధిహామీ కూలీకి రోజు వారీ కూలీ ఎంత వస్తుందో ఏపీవో నరేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచడానికి కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం మొదటి సారి కార్యాలయానికి వచ్చిన జెడ్పీ సీఈవో గణపతిని కార్యాలయ సిబ్బంది బొకే ఇచ్చి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో నరేష్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

### క్రికెట్ విజేత మంచిర్యాల జిల్లా జట్టు



బహుమతి అందుకుంటున్న క్రీడాకారులు

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి ఏఎంసీ క్రీడామైదానంలో జరిగిన క్రికెట్ పోటీల్లో మంచిర్యాల జిల్లా జట్టు విన్నర్స్‌గా నిలిచింది. మురళీ మెమోరియల్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో గత నెల 28వ తేదీ నుంచి క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాలకు చెందిన క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ పోటీలు మంచిర్యాల, కరీంనగర్ జిల్లా జట్ల మధ్య జరగ్గా ఈ పోటీల్లో మంచిర్యాల జిల్లా జట్టు విజేతగా నిలవగా రన్నర్స్‌గా కరీంనగర్ జట్టు నిలిచింది. క్రికెట్‌పోటీల్లో ప్రతిభ చాటిన అక్షయ్‌కుమార్ 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికయ్యాడు. విజేతలకు ఎంఎం సీసీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, కో ఆర్డినేటర్ శేఖర్ బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్ గౌతమ్, ఎంపైర్లు దుర్గయ్య, శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మొక్కలు పెంచాలి.. పర్యావరణాన్ని రక్షించాలి



మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారులు

**జైపూర్:** భావితరాలకు చక్కటి పర్యావరణాన్ని అందించడానికి మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని అటవీశాఖ డిప్యూటీ రేంజర్ సాగరిక తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జైపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గురుకలం పరిసరాల్లో మొక్కలు నాటి వాటి ప్రాముఖ్యతను వివరించారు. మొక్కలు మానవులకు ప్రాణవాయువును అందిస్తున్నాయని వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. చెట్లు అంతరించిపోవడం మూలంగా అనేక అనర్థాలు ఏర్పడుతాయని, పర్యావరణ సమతుల్యత కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో రామ్‌సింగ్, ఎఫ్‌బీవోలు సతీశ్, దీక్ష, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి


**వేమనపల్లి:** అన్ని గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. హరితహారం మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పర్యావరణ దినోత్సవంలో భాగంగా అన్ని గ్రామపంచాయతీల్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# వంతెనపై మృత్యు మలుపు..!

- అధికారుల నిర్లక్ష్యం.. ప్రయాణికులకు శాపం
- కొత్తపల్లి వాగు వద్ద తరచూ ప్రమాదాలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి సూరం మల్లారెడ్డి. మంగెనపల్లి గ్రామం. అవసరం నిమిత్తం చెన్నూర్‌కు వెళ్లి వస్తుండగా కొత్తపల్లి వాగు వంతెన వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి పిట్టగోడకు తగిలి గాయాలపాలయ్యాడు. ప్రాణాపాయ స్థితిలో ఆరు నెలలు వైద్యం చేయించుకొని రూ.7 లక్షలు ఖర్చు పెట్టగా గాయాలతో బయట పడ్డాడు. కర్ర సాయంతో నడవగలుగుతున్నాడు. కుటుంబం ఇతడిపై ఆధారపడి జీవిస్తుండగా ఇప్పుడు ఆయన పని చేసుకోలేని పరిస్థితి.



ఈ యువతి పేరు రౌతు కావ్య. జాజులపేట గ్రామం. మంచిర్యాలలో ఇంటర్ చదువుతోంది. ఏప్రిల్ 22వ తేదీన తండ్రి, అంకుల్‌తో కలిసి చెన్నూర్ వెళ్లి వస్తుండగా ఇదే వంతెనపై బైక్‌తో పిట్ట గోడను ఢీకొట్టగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తండ్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆమె కాలికి ఆపరేషన్ కాగా వైద్యుడు మూడు నెలలు విశ్రాంతి ఉండాలని సూచించారు.



ప్రమాదకరంగా కొత్తపల్లి వాగు వంతెన

**వేమనపల్లి:** మండల కేంద్రం నుంచి చెన్నూర్, మంచిర్యాలతో పాటు ఆసిఫాబాద్, పొరుగున ఉన్న మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలకు వెళ్లాలంటే కొత్తపల్లి వాగు వంతెన కీలకం. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ఈ వంతెన ఆర్అండ్‌బీ అధికారుల అవగాహణ లోపం కారణంగా, రాకపోకలు సాగించే ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారింది. సాధారణంగా వంతెన నిర్మిస్తే ఇరువైపులా రోడ్డుకు సమాంతరంగా వాహనాలు వెళ్లేలా నిర్మాణం చేపడతారు. కానీ వేమనపల్లి మండలంలో ప్రధాన రహదారిపై నాలుగేళ్ల క్రితం సుమారు రూ.2కోట్ల నిధులతో కొత్తపల్లి బతుకమ్మ వాగుపై నిర్మించిన వంతెన లోపభూయిష్టంగా ప్రమాదకరంగా ఉంది. వంతెన ఎక్కే చోటే మలుపు ఉండటంతో, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. చెన్నూర్ నుంచి వేమనపల్లి వరకు డబుల్ రోడ్డు ఉండటంతో సాధారణంగా మించిన వేగంతో వాహనాలు వెళ్తుంటాయి. అకస్మాత్తుగా వంతెన వద్దకు వెళ్లగానే వాహనం కంట్రోల్ కాక అదుపు తప్పి పక్కనే ఉన్న పిట్ట గోడను (రేలింగ్) ఢీకొడుతున్నాయి. దీనికి తోడు వంతెనపై మలుపు ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు.



వంతెనపై జరిగిన ప్రమాద దృశ్యం(ఫైల్)

**ప్రమాదాలు కోకొల్లలు**

ఈ వంతెనపై వేమనపల్లికి చెందిన అమర్, బబ్లు, పెంచికల్‌పేట మండలానికి చెందిన అశోక్‌చౌదరి దంపతులకు తీవ్ర గాయాలపాలయ్యారు. గోదావరిఖనికి చెందిన వెంకటేష్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. నీల్వాయి కొత్తగూడంకు చెందిన కృష్ణ అనే ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇలా మరెందరికో ఈ వంతెన ప్రమాదాలకు నిలయంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన వద్ద ఒక వైపు పిట్ట గోడను తొలగించి, రోడ్డుకు సమాంతరంగా ఉండేలా వెడల్పు చేయాలని వాహనచోధకులు కోరుతున్నారు. ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, వంతెన వద్ద ఏపుగా పెరుగుతున్న చెట్లను ఎప్పకటిప్పుడు తొలగించాలని, వేగం తగ్గేలా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### అటెన్షన్ ప్లీజ్..

## రోడ్డుపై గుంత.. ప్రయాణికుల చింత



**వేమనపల్లి:** మామడ-నీల్వాయికి వెళ్లే ప్రధాన రోడ్డుపై గుంత ప్రమాదకరంగా ఉంది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. పొలాలకు వెళ్లే రైతులు ఎడ్లబండ్లపై ఈ రోడ్డు మీదుగా వెళ్లేందుకు జంకుతున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చివేసి, రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి : శ్రీపతి బాపురావు, ప్రత్యేకాధికారి, నీల్వాయి

- ఫోన్ నంబర్ : 96526 02091